సంస్కర్త హృదయం

కీ. శే. శ్రీ. గురుజాడ అప్పారావు

★

[మహాకవి గురుజాడ అప్పారావుగారు ఆంగ్లంలో వ్రాసిన ఈ కథ అముద్రితంగానే ఉండిపోతే, శ్రీ అవసరాల సూర్యారావుగారు తెలుగుచేసి, ప్రకటనార్థం భారతికి పంపారు. వారికి కృతజ్ఞతతో ఈ కథ ప్రచురిస్తున్నాము—సం.]

గత శతాబ్దపు చివరి రోజులమాట; పడుపువృత్తి నిర్మూలింపబడాలనే ఒక ఉద్రేక భావం, సమాజాన్నంతటినీ ఆవరించింది. చెన్నరాష్ట్రమంతా ఇదే ఉద్యమం; కెరటంలా దేశమంతా ముంచెత్తి తగిన అదును చూసుకుని మరీ వచ్చిపడింది-*M*-అనే పట్టణానికి;-*M*-అనేది జిల్లాకు ప్రధాననగరం. ఈనాచ్ సమస్యను, 'కాలేజి యంగ్‌మన్స్ యూనియన్' వారు, వారాలతరబడి తీవ్రంగా చర్చిస్తూ వుండేవారు. వాదప్రతివాదనలు, ఖండనమండనలు, యితోధికంగా సాగిపోతూవుండేవి. తుట్టతుదకు పట్టణంనుంచి ఎవరో ఒకరు, మహావక్త, ఉద్రేకి, వచ్చి అనర్గళంగా ఉపన్యసించి, యీ రంధి తేల్చివేసేవాడు. ఆయన ఉపన్యాసంవిని ప్రతిపక్షంవారి గుండె లదిరేవి; స్వపక్షంవారు బలపడేవారు. నాచ్‌సమస్యకు వ్యతిరిక్తమైన సిద్ధాంతాలన్నీ పూర్వపక్షం చేయబడేవి. అంతటితో యువకులకు ఎక్కడలేని ఉత్సాహం పొంగుకువచ్చి, నాచ్‌సమస్య అంటేనే చాలు, చెవికోసుకునేవారు.

"యువకులకు కుదిరినంతటి ఏకాభిప్రాయం, పెద్దలకు మాత్రం కుదరడం లేదు. హిందూకాలేజి ప్రిన్సిపాల్, అంతటి విద్యాసంపన్నుడవునా! మర్యాదా, మప్పితం, సరళస్వభావం, గొప్పహోదా, హోదాకు తగిన దర్జా అన్నీ వున్నవాడేను; ఆయన నడవడిని చూసి అంతా గౌరవిస్తారు; శీలసంపన్నుడని మన్ననచేస్తారు; కాని ఆయనకీ ఉద్యమం దూరంగానే వుండిపోయింది. యాంటీ నాచ్ అనేది వుండతగిన సెంటిమెంటే; దానిలో ఆక్షేపణేమీ లేదు. కాని అందుకోసం ఏవేవో నియమాలు, ప్రతినలు, చేయబూనడమంటే ఆయనకు పరమఅసహ్యం. సెంటిమెంటు మంచిదే అంటూ ఇదేమిటి వేషం! విచిత్రంగా వుందే యీధోరణిఅని చెప్పి సంస్కర్తలు ప్రిన్సిపాల్ గారిని తమ వర్గీయుడుగా జమచేసుకోలేదు; పైగా ఖర్చు రాసుకున్నారు. ప్లీడర్లలో కొంతమంది యీ ఉద్యమం ఎంతో గొప్పదనే చెప్పారు; ఆశయాలెంత మహత్తరమైనవయినా, తాము మాత్రం, ఈ వాదనపట్ల సుముఖత చూపించలేమని, సెలవిచ్చారు. అదేమంటే, 'మాకు వచ్చే క్లయింట్లలో అత్యధికభాగం, యీ భోగంపడుచులే కదోయ్! అలాంటపుడు ఈ సంస్కరణకు పూనుకోవడమంటే, ఆ అమ్మాయిల పీకలు తడిగుడ్డతో నులిపెయ్యడమేకదూ!' అని జవాబిచ్చారు.

సీతాపూర్ బారులో సందడి చెలరేగింది. బార్ లీడరు కొంచెం తగుమనిషే. ఉన్నదివున్నట్టూ మనసులోని అభిప్రాయాన్ని పైకి చెప్పగలిగే అతని ధైర్యాన్ని అంతా మెచ్చుకుంటారు. ఒకనాటి సాయంకాలం టెన్నిస్ క్లబ్బులో యీ విషయం ప్రస్తావనకు రాగా, 'పగలల్లా తాను యాంటీ నాచ్ననీ, రాత్రిళ్లుమటుకే ప్రోనాచ్ననీ,' అరమరికలు లేక ఖండితంగా చెప్పివేశాడు. ఇరుపక్షాలవారికీ, యిది గౌరవప్రదమైన రాజీ అని, మిత్రులంతా అభిప్రాయపడ్డారు. లీడరు తెలివి తేటల్ని అభినందించారు.

ఆ ఊరి కాలేజిలో రంగనాథయ్యరు ప్రొఫెసరుగా పనిచేస్తున్నారు. మంచి సంస్కారి. ఉన్నతభావోద్రేకి; సంఘసంస్కరణోత్సాహి. మానవునిలో శారీరక మానసిక దౌర్బల్యాలు వున్నాయని వింటేనే, అతనికి జుగుప్స. అన్యాయాన్నీ, అవినీతినీ, ఏ రూపంలో వున్నా సరే, ఏరి పారవేయాలనే పట్టుదల అతని అణువణువునా కనిపిస్తుంది ఊళ్లో కొంతమంది విద్యాధికులే, ప్లీడర్లే ప్రోనాచ్ వాదులని, వినగానే అతని ప్రాణం చివుక్కుమంది. ఇది సహజమే మరి......వకీళ్ల నైతికపతనావస్థ చూసి, హృదయం కల్లోలపడింది. వెంటనే క్లాసురూములో, 'నీతినియమాలు' లేని వకీలు వృత్తిమీద తుపానులా పడి విమర్శించసాగాడు. తన క్లాసురూములో రంగనాథయ్యరు, తమను దుయ్యబట్టుతున్నాడనే వార్త పైకి పొక్కింది. జిల్లా మున్సబుగారి చెవికి సోకింది. ఆయనకి అరికాలుమంట నెత్తికి ఎక్కి చిందులు తొక్కడ మారంభించాడు. అర్థం పర్థం లేని వాగుడు రాయుళ్లు, స్కూలుగుంటలు, ఎంతో ప్రాముఖ్యతగల సాంఘిక సమస్యలమీద తగుదునమ్మా అని అభిప్రాయాలు ప్రకటించబూనడం ప్రమాదకరం. స్కూలుపుస్తకాల పొలిమేరలనైనా దాటని వీళ్లు, యిలాంటి సమస్యలలో వేలుపెట్టబూనడం దేనికి చెప్మా, అని ఆశ్చర్యం ప్రకటించారు. ఆశ్చర్యం క్రోధంగా మారింది. ఇందుకు తగిన కారణం లేకపో

లేదు. ఆయన భార్య ఎంతో మంచిది. నెమ్మదైనది. పరదాను తీసి బయటకు తొంగిచూసి ఎరగని మానవతి. ఆమె జనానా జీవితం యింతటి నిస్తబ్ధత పేరుకుని వుండడం మునసబుగారి కేమీ మనస్కరించలేదు. అందుకు విరుగుడుగా, నాజూకు భోగంపిల్లను సంపాదించి, కాలక్షేపం కోసం తన భార్యచెంత వుంచుకున్నారు. ఒకానొక జిల్లా మునసబుగారి మూఢాభిప్రాయా లంటూ తీవ్రమైన విమర్శనా వ్యాసమొకటి ఆ మర్నాటి స్థానిక దినపత్రికలో వెలువడింది. జిల్లా మునసబే కాక, ప్రోనాచ్ వకీళ్ల నందరినీ, మాతృదేశ విద్రోహులుగా ఆ పత్రిక చిత్రించడం మొదలు పెట్టింది. వ్యాసకర్త ప్రొఫెసరుగారే!

ఈ వ్యాసం పెద్దలలో సంచలనం కలిగించింది. ఊళ్ళో గొడవ హెచ్చింది. ఎక్కడ చూసినా యిదే ముచ్చట వినిపించసాగింది; ఇదే చర్చతో సందడిగా వుంది ఊరు. మున్సిపల్ కౌన్సిల్ లోను, దేవస్థానం బోర్డులోను సభ్యుల మధ్య వాదోపవాదాలు పెరిగి రెండు ముఠాలుగా చీలిపోయారు. కొందరు ప్రోనాచీయులు; మరికొందరు యాంటీనాచీయులు. ఇరు పక్షాలకు వాదన ముదిరి, చిట్టచివరకు చేతులు కలపడం దాకా వచ్చింది. కేకలు వేసుకోడంతో ఆరంభమయిన యీ వ్యవహారం పీకలు పిసుక్కునే వరకూ పెరిగింది. ఈ ఉద్రిక్త పరిస్థితులకు తాళలేక, ఊళ్ళో వున్న ఆ ఒక్క క్లబ్బూ, రెండు క్లబ్బులై, డబ్బు లేకపోవడంచేత, దివాలా తీస్తాయా అని భయ పెట్టసాగాయి. భోగం పడుచులకు ప్రోనాచ్ వకీళ్లంటే వొళ్లు కోసి యిచ్చేటంతటి అభిమానం పుట్టుకొచ్చింది. తమకోసం, తమ పరువు ప్రతిష్ఠల్ని నిలబెట్టడంకోసం, రెండు పక్షాలుగానైనా చీలిపోయి, ఎంతైనా సాహసం చూపిస్తున్నారు; తమ ప్రియురాళ్లమీద వారి కెంతటి దయాభిమానాలో! దీనికి ప్రతిఫలంగా, యథోచితమైన ఆనందాన్ని ప్రోనాచ్‌వారికి భోగం పడుచులు అడపా తడపా అందిస్తూనే వున్నారు. కాని సంస్కరణవాదుల పేరు చెబితే, సానిపిల్లల వొళ్లు గంగవెర్రు లెత్తుతోంది. వాళ్లలో వాళ్లు సంస్కర్తలను గురించి ఎకసక్కా లాడుకుంటున్నారు; తట్టాబాజా కడుతున్నారు, యాంటీనాచీయులు, సరసం తెలియని మోటు మనుషులు; ఇదేమి టే ఖర్మ! వీళ్ల మొహం కాని భోగంవృత్తి అరికడతా మంటూ రేమిటి? శృంగార రసాస్వాదన చేయలేని పరమ బ్రభ్రాజమానులే వీళ్లు! 'దుర్మార్గులమ్మా దుర్మార్గులు వీళ్లు,' అనే ప్రచారం విరివిగా సాగిపోజొచ్చింది.

ఈ ప్రచారాన్ని రంగనాథయ్యరు సుతరామూ లెక్కచెయ్యలేదు. ఎలాగో అవకాశం చేసుకుని, పాఠం మధ్యను ఆగి, విద్యార్థుల మనస్సులను 'సాల్టు సొల్యూషన్స్' నుంచి మరల్చి, సరాసరి పడుపువృత్తిని చేటలతో చెరుగుతూ విమర్శించేవాడు. సమాజంలో భోగంపడుచులు 'సేఫ్టివాల్వుస్' వంటివారు; ప్లేగులా వ్యాపించిన యీ అవినీతి రూపుమాసిపోక తప్పదు. ఇందుకు యువకులు సంసిద్ధులు కావాలి. నైతికపతనావస్థనుంచి దేశాన్ని విద్యార్థు లుద్ధరించాలి. ఇదీ అతని ప్రబోధ సారాంశం.

ఆయన ప్రబోధాన్ని క్లాసులోని విద్యార్థులు జాగ్రత్తగా వినేవారు. కాని 'చందర్' అనే విద్యార్థికి మాత్రం యిది రుచించలేదు. చందర్ గొప్ప భూస్వామి బిడ్డడు. ఎప్పుడూ చేతినిండాగ్గా డబ్బు ఆడుతూ ఉండేది. గుడ్డెద్దు చేలోపడ్డట్టు ప్రొఫెసరు చెప్పే ప్రతీమాటకూ బుర్రూపుతూ క్లాసులో కూర్చునే విద్యార్థి అంటే అతనికి తలనొప్పి. ఆయన చెప్పే ప్రతీ విషయాన్నీ తూచి పరీక్షించి నిగ్గు దేల్చుకోవాలి. ఇది ఎంతవరకు ఆచరణయోగ్యం? ఏయే భాగాలలో అనంగీకారమో, ఒక భోగంపడుచును, మైక్రోస్కోపు ముందువుంచి ఎనలైస్ చేసిచూస్తేనే తప్ప అమీతుమీ తేల్చుకోరాదు. ప్రయోగం, పరిశోధన, ఋజువు సాక్ష్యపడనిదే ఏదీ సిద్ధాంతంగా చెప్పకూడదు. ఈ పట్టుదలతోనే, కంటికి యింపుగా కనిపించిన సరళ అనే పిల్లను చేరదీశాడు. సరళ ఊరందరి మనసులోనూ పడినపిల్ల; చక్కని మనిషి; తీయని కంఠస్వరం; శాస్త్రీయసంగీతాన్ని చక్కగా అభ్యసించింది. తన నాజూకు కొనవేళ్లతో వీణను మీటుతుంది; ఏయే సమయాలలో, ఉత్సవాలలో, ఏయే పాటలను పద్యాలను పాడాలో నేర్పుగా నేర్చుకుంది. ఎవరికీ రానన్ని, సంస్కృతశ్లోకాలు, తెలుగు పద్యాలు, కృతులు నోటికి ధారాళంగా వచ్చును. ఈ పిల్లపై చందర్, మానవపరిణామశాస్త్ర పరిశోధనకై ప్రయోగాలు చేస్తున్నాడు; పరిశోధన యింకా పూర్తి కాలేదు. దిక్కుమాలింది, ఎప్పటికప్పుడే సరికొత్త విషయాలు, సమస్యలు వరసవరసగా పుట్టుకురావడంతో పెద్ద యిబ్బంది కలిగింది. శాస్త్రతృష్ణ జాస్తీ కాజొచ్చింది.

సరళతో తమ క్లాసుమేటు ఎక్స్‌పెర్‌మెంట్సు చేస్తున్నాడనే సంగతి కొంతమంది విద్యార్థులు పసికట్టారు. వీరిలో కొంతమందిని చందర్ తన అనుయాయులుగా మార్చగలిగేడు. కొందరు పెద్దలు అతని ప్రయత్నాలను అభినందించారు. లేబరేటరీలో పరిశోధనకు తగిన వాతావరణం లేదు; ఈ వాతావరణంలో అన్నీ సదుపాయాలేలని, స్నేహితులు ఎంతో యిదిగా అతన్ని మెచ్చుకుంటున్నారు. ఈ నూత్న పరిశోధనకోసం చందర్ రచించిన సూత్రవివరణ అమోఘమయినదనీ, లేబరేటరీలో దుర్వాసన కొట్టే సల్ఫ్యూరిక్ యాసిడ్, హైడ్రోజన్లకంటె, అగరు,

అత్తరుల వాసనలు సరికొత్త మార్పులని అంగీకరించారు. కాని క్లాసులో మాత్రం పెద్ద ప్రమాదం వచ్చి పడింది. నీతివాదులకు వీరి పద్ధతి నచ్చలేదు; మధ్యను కాళీగా ఒక బెంచీ విడిచివేసి, దూరంగా వేరే ఒక మూలకు చేరిపోయారు. క్లాసులో రెండు వర్గాలు ఆరంభమయినాయి. దీనికి కారణం బోధపడక మొదట ప్రొఫెసరు కంగారుపడ్డాడు. చివరకి తెలుసుకొని మండిపడ్డాడు. వేశ్యలమీద సాధారణంగా అతనికుండే క్రోధం, అసాధారణమై, స్త్రీలలోని అలసత్వాన్ని చూసి ఉపయోగించుకుంటోన్న ప్రోనాచ్ వాదులమీద అగ్గి కురిపించేవాడు.

2

రంగనాథయ్యారు గ్రీకులవంటి సౌందర్యారాధకుడు. ప్రతీరోజూ స్వర్ణలేఖానదీతీరాన షికారు తిరిగేవాడు. లోయచుట్టూ చిందరవందరగా గడ్డితో పచ్చగా రాతిబండలు వున్నాయి. అక్కడే గున్నమామిడితోపులు, చింతచెట్లూ శీతాహంగా కనిపిస్తున్నాయి. తోటదాటినతరువాత, పచ్చికబయలు సముద్రంలా కనిపిస్తూ ఎదిగివుంది. దాని చివరను నావలా, ఒక పెద్ద కొండ; కొండమీద పురాతన దేవాలయం, గాలిగోపురాలతో, ఎన్నో శిఖరాలతో, విమానాలతో వెలిసింది. ఈ వాతావరణం ప్రొఫెసరు నాకర్షించింది. ప్రతీ సాయంకాలం అక్కడనే తచ్చాడుతో స్నేహితులతో పిచ్చాపాటే చెప్పుకునేవాడు. కవిత్వం విజ్ఞానం, మున్నగు విషయాలను శిష్యులతో చర్చిస్తూ వుండేవాడు. తన భార్యకు తను తలపెట్టిన గృహ సంస్కరణలు నచ్చలేదు; నచ్చక ఊరుకుంటే బావుణ్ణు. లేనిపోని బెడదలకు తన మగడు పోతున్నాడని ఆవిడ చిర్రుబుర్రులాడేది; సాధించేది. ఇంటికి యిప్పుడప్పుడే పోయి, గయ్యాళీ భార్యతో గిల్లికజ్జా తెచ్చుకోడమెందుకని, ప్రొఫెసరు బాగా చీకటి పడేవరకు, అక్కడనే షికారు తిరిగేవాడు. ఈ సమయంలోనే ఒక నిండు జవ్వని అదే దేవాలయానికి వచ్చి స్వామిని దర్శించుకునేది. ఆ పిల్ల సరళే నని తెలుసుకుని సంస్కర్తలంతా సంబరపడ్డారు. ఆ పిల్లలో యింతటి హఠాత్పరిణామం, కలగడానికి హేతువు తమ ఉద్యమప్రభావమేనని గర్వించసాగారు. అనుమానమేమీ లేదు. తను చేసిన పాపాలకా అమ్మాయి పశ్చాత్తాప్పడుతోంది. వచ్చే జన్మలోనైనా సరళ, గౌరవప్రదమైన గృహిణిగా పుడుతుందని ఆశించారు; కాని...హరిహరీ!...సరళ కెన్నటికీ ఆ తలంపే లేదనీ, ఆవిడ దేవాలయానికి రావడం, ప్రొఫెసరును, అతని స్నేహితులను ఆకర్షించడానికేననీ, నేను మాచాయగా చెప్పవలసివస్తున్నందుకు పాపం శమించుగాక!

ఒకనాటి సాయంకాలం. సూర్యుని బంగారు కాంతి చుట్టూ పడుతోంది. అందమైన ముఖమల్ వంటి ఊదారంగు చీరె కట్టుకుని, పసుపుపచ్చని సిల్కు ముసుగుతో, తళతళ మెరిసే జరీ అంచుల మధ్య చూడచక్కని చిన్నది, దేవాలయానికి వచ్చింది. వచ్చి కొండమెట్లు దాటుతూ, కిందకు చూసింది. "ఒహో! ఏమా సౌందర్యరాశి!" ప్రొఫెసరుగారి ఆశ్చర్యం చూసి అంతా మౌనం వహించారు. "ఆహా! ప్రేమతో తొణికిసలాడే ఆ దృశ్యాన్ని రంగులలోకి మార్చాలంటే చిత్రకారుడికెంతటి ప్రతిభ కావాలి? అతని ఊహకు అందని దృశ్యమిది!" రంగనాథయ్యారు ఆనందం పట్టలేకపోయాడు; ఉద్రేకం ఉప్పొంగుకువచ్చింది. కూడావున్న పండితమిత్రులను ఉత్సాహపరచాలనే సంతోషంతో నాలుగు శ్లోకాలు చదివి వినిపించేడు; వనదేవతల, నదీకన్యల సౌందర్యాన్ని అభివర్ణిస్తూ వారిని ఆహ్లాదపరిచాడు. అతనేమో రసాయనశాస్త్రజ్ఞుడు. కెమిస్ట్రీకి సంబంధించిన పడికట్టురాళ్లవంటి సిద్ధాంతాలు, ఏవేవో అంకెలు, లెక్కలను అంటిపెట్టుకోక అతనిలాంటి విషయాలలో దిగకూడదని నా అభిమతం. కాని ఆకర్షించే సౌందర్యరాసి, ఎదుట మసులుతోన్నపుడు కవి హృదయం వున్న ఎంతటి ఆజన్మ వేదాంతికయినా మనసు చెదరక తప్పదు.

ఇంతటి అందమైన మనిషి సంగతి పూర్తిగా తెలుసుకోవాలనే కుతూహలం రానురాను అతనికి మిక్కుటమయింది. కుతూహలం కోరికగా మారింది. మనసు మనసులో లేదు. అతని అంతరాత్మ యిలా ప్రశ్నించింది 'ఆవిడ ఎవరో తెలుసుకుందుకు నీకెందుకా ఆరాటం?'

'ఎందుకేమిటి! సౌందర్యమన్నది స్తుతించతగ్గదే. ఇందులో వచ్చే ప్రమాదమేముంది?' తనను తాను సముదాయించుకున్నాడు. అంతరాత్మ మళ్ళీ ఏమీ ప్రశ్నించలేదు. ఆ సాయంకాలమల్లా అక్కడే వుండిపోయాడు. గుడిలో స్వామివారికి పవళింపుసేవ అయిపోయిన తరవాత, గుడి తలుపులు మూసివేశారు. అంతవరకు, ఆమెను చూద్దామనే ఆశతో, అక్కడనే మాట్లాడుతూ వుండిపోయాడు. కాని ఆవిడ కనిపించలేదు!

నిరాశతో యింటివైపు దారితీశాడు. అంతా నిశ్శబ్దం. ఎవరూ ఏమీ నోరు కదపడంలేదు. నడుస్తూ దారిమధ్య యిలా ప్రశ్నించుకున్నాడు: 'మళ్ళీ సోమవారం, ఆ పిల్ల కోవిలకి వస్తుందంటావా? రాదంటావా?'

"కపడ్దార్! పాపం, పుణ్యం ప్రపంచంలో వున్నాయనే సంగతి స్మరించుకో" అంటూ అతన్ని

హెచ్చరించినట్లయింది. గద్దించినట్లయింది; అతని అంతరాత్మ. ఎక్కడలేని ఆత్మాభిమానం ముంచుకు వచ్చి 'రంగనాథయ్యరు, యిలాటి మనశ్చాంచల్యాల కతీతుడు!' అని సమాధాన మిచ్చాడు.

మళ్లీ సోమవారం వచ్చింది. మిత్రులను వెంట బెట్టుకొని ప్రొఫెసరు కొండమీదకు షికారు వెళ్లేడు. ప్రకృతి నిశ్చలంగా వుంది. కళకూ, శిల్పానికీ గల భేదాలను వివరిస్తూ మాట్లాడుతున్నాడు. ఎదుట కొండ; దాని శిరస్సున కిరీటం వుంచినట్లున్న దేవాలయం ఎంతో కన్నుల వైకుంఠంగా వున్నాయి. 'తిరిగీ ఆ సౌందర్యరాశి కంటికగుపిస్తే ఎంత బాగుండును' అని దేవాలయంవంక రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. కాని వెంటనే అతని ఆత్మాభిమానం గాయపడ్డట్లయింది. మనోగర్వం అతిశయించింది 'ఇలాటి వేవీ నేను లెక్కచేయమన్నా చేయ'ననుకున్నాడు. "ఆమె ఎవరో తెలుసుకోవాలనే ఆసక్తి తప్ప దీనిలో దోషమేముంది?" అని ఎదురు ప్రశ్న వేసుకున్నాడు. కాస్సేపు అటూఇటూ చూసేసరికి సరళ ప్రత్యక్షమయింది. గుండెలదురుతున్నాయి. రెండు నిముషాల పాటు కొండశిఖరాన నించుని, సరళ అటూఇటూ చూసింది. దిగువను స్వర్ణలేఖానది ప్రవహిస్తూ వచ్చి ఒక బండరాయిచుట్టూ సన్నగా చీలిపోయింది. ఆ బండరాతిమీద మాట్లాడుతూ కూర్చున్న ప్రొఫెసరు, అతని మిత్రులు, సరళకు కనిపించారు. సరళను చూసి అతనిక ఉండబట్టలేకపోయాడు. "ఆ చిన్నది ఎవరై వుంటుందయ్యా?" అని బయటకే అనేశాడు. అర్థవంతమైన దృక్కులతో ఒకరినొకరు చూసుకుని మిత్రులు మౌనం వహించారు.

కంఠం సవరించుకుని అయ్యరు వర్డ్స్‌వర్తు గీతం పాడుతూ ఉదహరించాడు

"తొలుత నామె నా చూపుల దొరలునపుడె
మగువ ఆనంద దివ్యమూర్తిగ స్ఫురించె!"

కన్నులు మూతలుపడి యోగనిద్రలో వున్నట్లనిపించింది. బౌద్ధ దేవాలయాలు, ఆరామాలను గురించి ముచ్చటిస్తోన్న వ్యక్తి హఠాత్తుగా ఆగిపోయాడు. ఎదురుగా నిల్చున్న ఆ అందాలబరిణ ఎవరో తెలుసుకుంటేనే కాని ప్రాణం కుదుటపడదు; మనశ్శాంతి లేదు. మళ్లీ ఉపన్యాసం సాగేటట్లు లేదు. అందువల్ల స్నేహితుడొకడు సాహసించి "అదా? అది వొట్టి వ్యభిచారిణి! పేరు సరళ." ఈ మాట విని గుండె నీరసించిపోయింది. "అంతటి అందమైన సూర్య తేజస్సు వెనక ఎంతటి అంధకారం!" అతని విభ్రాంతికి మేరలేదు. "పాపపంకిలమైన ఆ స్త్రీ పట్ల తన అమూల్య సౌందర్య సంపదనంతా వినియోగించే ప్రకృతి ఎంత అసంబద్ధం!"

హృదయం ఎందుకో నీరసించినట్లయింది; అతనిలో యేదో అస్పష్టమైన భావం ఉదయించింది. దూరంలో వినిపించే ధ్వనిలా వినిపించసాగింది. తలుచుకుంటే యీ భావం రమ్యంగా వున్నట్లుంది. మనసు కదో తృప్తి నిస్తోంది. ఆశను కల్పించి ఉన్మాదిని చేస్తోంది. 'తనకు సరళ సునాయాసంగా లభిస్తే! ....' ఈ భావం తనలో జనించి క్రమేపి జయిస్తున్నట్లు అతనికే తెలియడంలేదు!

3

సరళ! ఎంత అందాలరాశి! ఎవరో కాదు; ప్రతీరోజూ విద్యార్థుల తీవ్రవిమర్శకు గురవుతోన్న పిల్ల—ఆ పిల్లను చూసినప్పట్నుంచీ, విశేషించి ఆవిడ సరళేనని తెలుసుకొన్నదిమొదలు, ప్రొఫెసరు మనసు అల్లకల్లోలమయింది. హృదయంలో, సంఘర్షణ ప్రారంభమయింది. గతించిన తన పసితనపు రోజులు, చదువుకునేనాటి స్మృతులు జ్ఞప్తికి వచ్చాయి.

ఇల్లు విడిచి, పుట్టిన ఊరు వదిలి, దూరంగా ఎక్కడో చదువు; ఏకాకిజీవితం; తెరిచింది మొదలు, మూసేవరకూ, పుస్తకంమీదనే ఏకాగ్రత. తన చదువూ తనూ తప్పిస్తే మరో ప్రపంచం కనిపించలేదు; వినబడలేదు. అయితే నేమి, పరీక్షలలో క్లాసులు వచ్చాయి. జీవితంలో మంచి ఉద్యోగం లభించింది. నిక్షేపంలాంటి జీవితం. విద్యార్థిగా ఉంటున్నప్పుడు జీవితంలో ఒక్కొక్కసారి ప్రకృతితో తన్మయీభావం కలిగేది. ప్రకృతీ, జీవితం శృంగారమయంగా గోచరించేవి. ఈ శృంగారభావం యిట్టే పుట్టి అట్టే మాయమయేది. విజ్ఞానశాస్త్ర పాఠాల రొకటిపోటు, ఉత్సాహం ఉడిగిన జీవితం, యీ తన్మయీభావాన్ని నశింపచేశాయి. సంఘసంస్కరణ పోరాటాలను వేదికలమీదను, పత్రికలలోను, కొనసాగిస్తూ ఖ్యాతి నార్జింపజూచే, హిందూ విద్యాధికుల ఆలోచనలకే అతని బుద్ధి నేటికీ అంటిపెట్టుకొనివుంది. గురువుల బోధనలను యథాతథంగా నిజాలుగా స్వీకరించాడు. మద్రాసులో తనతో తిరిగే స్నేహితుల భావాలన్నీ అతనికి పథ్యంగా కనిపించసాగాయి. పుస్తకాలలోని 'రెడీ మేడ్' అభిప్రాయాలను సిద్ధాంతాలుగా స్వీకరిస్తూ ఆ ఆలోచనల వాతావరణంతో మసులుతున్నాడు. ఇంతకు భిన్నమైన అభిరుచులను అతని జీవితం చవిచూడలేదు. కొన్ని సిద్ధాంతాలు, నమ్మకాలు ప్రొఫెసరుకున్న మాట నిజమే. కాని అవి అనంతమైన జీవిత సంఘర్షణనుంచి జనించినవి కావు. అందువలన బలీయమైనవి కావు. లేకుంటే, భోగంపిల్ల సరళ కనీకనిపించగానే, యిట్టే అతని మనసుకు 'ఎర' వేసినట్లవుతుందా! జీవితంలో

సంఘర్షణ ప్రారంభమయింది. ఇది సంఘర్షణమాత్రమే కాదు. నువ్వా నేనా అని తేల్చుకోవలసిన పరీక్ష!

ఆమె మూర్తి కన్నులకు కట్టినట్లయింది. సరళ కోమలశరీరం. క్షణం క్షణం అతని మనసును పిడిస్తున్నది; ఆలోచనలను వేధిస్తోంది. విశ్వాసాలను వమ్ము చేస్తోంది. 'సుందరమగు వస్తువు సతత మానందదాయకమగును' అని తను ఎక్కడో చదివిన రసాత్మకవాక్యం జ్ఞప్తికి వచ్చింది. ఈ ఆనందజనక హేతువు, వొక భోగంపిల్ల అయితే నేమి? తను అనుకోకుండా, ఒక పిల్ల భోగం కులంలో జన్మించిన మాత్రాన, మానవులు ఆమెను ఏవగించుకుని, నేరస్థురాలికిమల్లే శిక్షించవచ్చునా? లోకంలో అనేకమంది దురదృష్టవంతులున్నారుకదా, వారిని మనం కనికరిస్తున్నామా లేదా? పోనీ వారికిమల్లే భోగంవారిని మానవులు ఎందుకు దయతో చూడకూడదు? అందులోనూ సరళ వంటి పిల్లను! ఇంతటి అందగత్తెను విచ్చలవిడిగా విహరించనిస్తే, సంఘమూ పాడవుతుంది; ఆవిడా చెడిపోతుంది. అలాంటపుడు ఆమెను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రేమను, కరుణను, తెలివిని, చివరకు ధనాన్నయినా సరే ధారపోసి ఆమెను ఉద్ధరించాలి. భోగంపడుచుతో మాట్లాడితే నే మహాపాపం అనుకోవడం ఎంత తప్పు! సమాజరుగ్మతిలకు చికిత్సచేయవలసిన డాక్టరు సంఘసంస్కర్తే!

ఈసారి మళ్లీ కనిపించింది సరళ. తెల్లని చీర కట్టుకుంది. చేతిలో వెండి పూలసజ్జ పట్టుకుంది. గుడిలోనికి వయ్యారంగా నడుస్తూ వెడుతోంది. కోవెలలో సరళ పూజచేయించడంకోసం వెడుతోందని అతను ఊహించాడు. విగ్రహందగ్గర యీ పాటికి నిలబడివుంటుందని భావించాడు. నిజంగా ఆమె ఎలా వుంటుందో! దూరపుకొండలు నునుపు. దగ్గరి కెడితే సరి మనిషి లోతు పాతులు, లోటుపాట్లు తెలిసివస్తాయి. ఆమె కురూపి కావచ్చునేమో! ఆమె ముఖభంగిమలు వికృతంగా కనిపించవచ్చును. దూరం అనేది వీటిని కప్పిపుచ్చుతుంది. ఆమె అందవికారంగా వుంటే తను చేయగలిగే దేమీ లేదు; అలా కాక అందంగావుంటే?......అహా! ఆదర్శప్రాయమైన అందం భోగంపిల్లలలో వుండడం అసంభవం! అందమైనదనే సత్యాం, మరుగుపరచలేనిది. ఇంతకీ ప్రయోజన మేమిటి? ఏది ఏమైనా యీ భోగంపడుచును సంస్కరించితీరాలి.

భావాలను తరచుకుంటూ రంగనాథయ్యరు కొండమీదకు దారితీశారు. దగ్గరదారిని కోవెలలోనికి అడుగు పెట్టాడు. భక్తులతో గుడి కోలాహలంగా వుంది. చోటు చేసుకుని, సరళకు కొంచెం పక్కగా నిలబడి చూస్తున్నాడు.

జీవితంలో ఒక భోగంపిల్లపక్కను తను నిలబడడం యిదే తొలిసారి. మొహం ఎత్తి సరళను చూసేసరికి చటుక్కున మూడువిషయాలు స్ఫురించాయి. మొదటిది: దేవతాస్త్రీల అందాన్ని సరళ పుణికిపుచ్చుకుంది; రెండోది: ఆమె దైవభక్తి అపారం; మూడోవిషయం: మహాశివుడు అర్ధనారీశ్వరుడై స్త్రీపురుష సమాన హక్కులను లోకానికి చాటుతున్నాడు; స్త్రీలూ పురుషులూ సరిసమానమే; అందుకు అర్ధనారీశ్వరుడే సాక్షి. సరళ సాహచర్యభాగ్యం లభిస్తే ఎంతో బాగుండును. ఆ ఆనందం అనుభవించాలనే కోరిక అతనిలో ఆశగా పరిణమించింది. ఆత్మను లతవలె అల్లుకుంది. అటువంటి మనోహరవిగ్రహంలో ఏ క్రూరత్వమూ యిమిడి వుండదు. సరళలోనే దుష్టస్వభావం వుంటే ఆకాశంలో మెరిసే నక్షత్రాలలో కూడా స్వచ్ఛత లేదన్నమాట! సూర్యుని తేజస్సు చీకటి కావాలని దాని అర్థం! ఉదారతాజనకమైన ఆమె సౌందర్యం నిర్మలానందమయం. దాని నింకా ఉదాత్తంగా, గంభీరమైనదిగా మార్చడమే మానవకర్తవ్యం.

నాటిరాత్రి అతనికి నిద్రపట్టలేదు. రాత్రంతా శివరాత్రిలా గడుపుతూ, ఎన్నెన్నో ఊహలతో, భోగంపిల్లలను ఎలా సంస్కరించాలనే ఆలోచనలతో పథకాలను వేస్తూ బిత్తరపోయాడు. నిజపత్ని జ్ఞప్తికి వచ్చింది. ఆమెను ప్రేమించడం అతని ధర్మం. పుట్టింటికి పంపించమని తనను ఎంతో యిదిగా కోరుకుంది. ఎన్నాళ్లైందో పాపం, ఆవిడ పుట్టింటికి వెళ్లి! పంపిద్దామంటే దూరంకదా! దూరమయినా, భారమైనాసరే, ఈసారి పంపించివేయాలి; తప్పదనుకున్నాడు.

ఆమర్నాటి ఉదయం కాలేజీలో ప్రిన్సిపాల్ గారిని కలుసుకున్నాడు. ఆయనతో మాట్లాడుతూ 'పడుపువృత్తిని అరికట్టడమెలాగ' అనే విషయం ప్రస్తావించాడు. బస్తీలో తన తమ్ముడున్నాడు. అతనికి యీ విషయమై ఒక సభను ఏర్పరచవలసిందిగా ఉత్తరం రాద్దామన్నాడు. ఆ సభలో 'విముక్తి సైన్యాన్ని' దళాలుగా నిర్మించుకోవచ్చును. ఈ లోపున, కొన్ని ప్రయోగాలు, పరిశోధనలు స్థానికంగా చేసి చూసుకోవచ్చును.

"సమాజానికి అతి ప్రమాదకరంగా పరిణమించిన భోగంపిల్లను చూసి, కొంత పరీక్షిస్తాను."

"ఎవరినీ? భోగంపిల్లనా?" గతుక్కుమని ప్రిన్సిపాల్ ప్రశ్నించాడు.

"అవును."

"సరళ నేనా?"

"పోనీ ప్రయత్నించి చూస్తానూ!"

"మనోవికారాలకు లోనుకాకూడదు ప్రొఫెసర్! మనలాంటివాళ్లం, ఆకర్షణల దరిదాపుకైనా పోరాదు; మంచివాళ్లకీ పద్ధతి మరీ మంచిది."

ప్రొఫెసరుగారి మోము వివర్ణమైపోయింది. రోషం గొంతుకలో ప్రతిధ్వనించింది.

"నా దారిని ఎంతటి విషయలోలుడు అనుసరించినా మారకమానడు;"

ఇంతకాలంనుంచీ ఆయనను ప్రిన్సిపాల్ గారు, తన సోదరునివలె అభిమానిస్తున్నారు; కన్నకొడుకులా ప్రేమిస్తున్నాడు. ప్రొఫెసరుది రసార్ద్రహృదయం; ఏం ప్రమాదం కొని తెచ్చిపెడుతుందోనని ప్రిన్సిపాల్ గారి భయం;

"ప్రమాదాలేమీ రాకూడదని ఆశిస్తున్నాను; నీ ప్రయత్నం సఫలమగుగాక!"

రంగనాథయ్యరుకీ ఆశీర్వచనాలు, హెచ్చరికలుగా కనిపించి, మనసును గిల్లినట్లయింది. చికాకు పుట్టుకొచ్చింది. ఆత్మగౌరవం గాయపడ్డట్లు ఫీలయాడు. పతితుల నుద్ధరించాలనే పైపై ఆలోచనల మధ్య నిగూఢమైన ఒక కోరిక, అతనికి తెలియకుండానే, పుట్టుకొచ్చింది; ఆ యిచ్ఛ బలంగా పెరిగి సరళవైపు ప్రవాహంలా పరుగులు తీసింది.

తనకు ప్రత్యామ్నాయంగా ఎవరినైనా యీ సత్కార్యసాధనకు వినియోగించుకోవాలి. ఈతలంపు అతని కెంతో ఊరటకలిగించింది.

౪

ఈ రాచకార్యాన్ని చదరంగంలా నడిపించగల యుగంధరులెవరు? వరస వరసనే మిత్రులను స్మరణకు తెచ్చుకోగా, విశ్వనాథశాస్త్రి, మనసుకు తట్టేడు. అతను మంచి పండితుడు. సమయా సమయాలనుబట్టి జాగ్రత్తతో మెలగవలసిన మనిషి. ఎదుటవారి అభిప్రాయాలు, అవి ఎంత అవకతవకగా వున్నా సరే - ఇట్టే ఆమోదిస్తూ తెలివైనవాడిగా ప్రఖ్యాతిని సంపాదించాడు. ఆంగ్ల విద్యాధికులతో పరిసమానంగా మసులుతున్నాడు. అన్నింటికీ అవునవునంటూనే, తన పని కొనసాగించుకోగల ఘనాపాఠి. ఇతనే తన "విముక్తిసైన్యానికి" ప్ర ప్రథమ సైనికుడు. విశ్వనాథశాస్త్రిని రిక్రూటుచేస్తే తనపని సుగమమవుతుందని ప్రొఫెసరు ఉబలాట పడుతున్నాడు. కాని యిదంతా విన్న శాస్త్రికి యీ ప్రణాళిక ఎందుకూ కొరగాదనిపించింది. రంగనాథయ్యరు వంటి వెర్రిమాలోకపు మనిషి ఎక్కడైనా వున్నాడా! అయితే చేజిక్కిన వ్యవహారమా, చేజిక్కని వ్యవహారమా అని శాస్త్రి ఆలోచించుకోసాగాడు. డబ్బుతో కూడిన వ్యవహారం; డబ్బు చేదా? గల గలమంటూ అది చేతిలో పడితే శాస్త్రి సాధించలేని పనిలేదు. ఎంతటి విరుద్ధమతమైనా శాస్త్రసమ్మతమేనని సమర్థించగల పండితుడు. గ్రంథాలనుంచి, అనేక సూత్రాలను, యుక్తులను ఎత్తి చూపిస్తూ సప్రమాణంగా తన వాదనను నిరూపించుకోగలడు. వేదాలు బ్రహ్మసృష్టి కాదనీ, కేవలం మానవ ప్రోక్తము లేననీ ఏనాడో అంగీకరించాడు. పురాణాలు వట్టి అభూత కల్పనలేనని తేల్చివేశాడు. మానవ పరిణామవాదంలో తనకు గల నమ్మకాన్ని నలుగురిలోనూ ప్రకటించుకున్నాడు; కాని మనిషినీ, కోతినీ ఒకే వంశవృక్షాని కెక్కించడం అతనికి వింతనిపించి, తనలో తాను నవ్వుకున్నాడు.

భోగం వృత్తి నిర్మూలింపబడాలనే వాదన ఎలాగో ఒకలాగ అతనికి వచ్చింది. ఈ ఉద్యమం నలుమూలలా విస్తరించవలసిందే. దేశంలో సానివాళ్లుండకూడదు. ముంగుకు ఉరకలు వేసి పోతున్న నాగరికతకు, వేశ్యల ఉనికి ఆటంకం. ఈ ఆటంకాన్ని తొలగించేందుకు, ప్రచారం అవసరం.

ఒక శుభదినాన్న ఈ పవిత్ర ప్రచారభారం శాస్త్రిమీదకు వచ్చిపడింది. అంతటితో సంఘ సంస్కరణ కుపక్రమించాడు. నవజీవిత గృహప్రవేశం చేస్తూనే, ఏ భయిరూపాయిల సంభావన పుచ్చుకున్నాడు. తనకు ప్రొఫెసరెందు కింత మొత్తం యిస్తున్నాడనే సంశయం శాస్త్రికి కలగకపోలేదు. సంఘసంస్కరణకంటే యిందులో ఏదో స్వార్థం వుండకపోతే యింత పెద్ద మొత్తం ఎందుకిస్తాడు!

రెండువారాలపాటు సరళకు శాస్త్రి భగవద్గీత చదివి వ్యాఖ్యానం చెప్పాడు. స్త్రీల పాతివ్రత్యాలను చాటే పురాణ ఘట్టాలను యిద్దరూ కలిసి చదివారు. కాని యీ రెండు వారాల శ్రమ వట్టి నిష్ఫలమైంది. భోగం సమస్యమీద జరిగే చర్చలలో ఆమెదే పై చేయిగా కనిపించింది.

"ఆవిడవన్నీ యక్షప్రశ్నలండీ! 'చంద్రవంశపురాజుల నెత్తురు, సానివాళ్ళదే కదటండీ' అని ఆవిడడిగే సరికి నా నోరు మూత పడిపోయిందంటే నమ్మండి."

"అయితే ఏం జవాబిచ్చారు?"

"పురాణాలన్నీ అబద్ధాలనీ, మర్కటాలనుంచి మానవులు కలిగేరనే పరిణామవాదమే నిజమనీ, చెప్పేద్దామనుకున్నాను; కాని ఊరుకున్నాను."

కొంచెం తటపటాయించుకుని శాస్త్రి, ప్రొఫెసరు కేసి చూస్తూ.

"ఆ పరిణామవాదం ప్రకారం వారకాంతలకు సమాజంలో స్థానంలేదని రుజువుచేద్దామని నా తాపత్రయం."

"దాని జోలికి యిప్పుడప్పుడే పోకండి; కోతులతో ఉపన్యాసం ప్రారంభిస్తే అల్లరిపా లవుతుంది వ్యవహారం."

"అయితే ఏమిటి సాధనం ?"

"కాస్తైనా లోకజ్ఞానం వుంటేనే తప్ప, పరిణామవాదం సులువుగా బోధపడదు; ముందు కాసిన్ని పిట్టకథలు చెప్పి ఆకర్షించరాదూ?"

"ఆ పని చెప్పడానికి సులువే; చేయడం కష్టం. మీలా నేను యింగ్లీషు చదువుకోలేదాయె! సరళతో మహాచిక్కు. ఆవిడ తలలో అన్నీ ధర్మసందేహాలే, సరస్సులో వికసించే వసంతకాలపు పద్మాల్లా."

కొన్ని వారాలు గడిచిపోయాయి. సరళకు తనవల్ల పాండిత్యమే అబ్బుతున్నది కాని, అన్యథా మార్పేమీ కలగడంలేదు. శాస్త్రి కిది మనస్తాపం కలిగించింది. ఈమెను ఎవరు మార్చగలరు! ఒకే ఒకడు, యీమెను మార్చగలిగేవా డున్నాడు. అతనే పవిత్రురాలినిగా చేయగలడు. కాని యీపనిని చేసేందు కతను జంకుతాడా? సరళ అతనిని గౌరవిస్తున్నది; ప్రేమిస్తున్నది. సరళపట్ల ఎవరూ లోకంలో తీసుకోని జాగ్రత్తను, అతను ప్రదర్శిస్తున్నాడు. అందుకే అతనంటే ఆమెకు ప్రేమ, అతని పెదవులనుండి ఒకమాట జారిపడితే చాలును, ఆమె మారిపోతుంది; తప్పదు!

విశ్వనాథశాస్త్రి సరళయింటికి వెళ్ళినప్పట్నుంచి, ఆవిడ కోవెలకు రావడం మానివేసింది. ఇది రంగనాథయ్యరుకు విచిత్ర మనిపించింది. నదిఒడ్డుకు వారంవారం షికారుకు వెడుతున్నాడు; సరళదర్శనం దుర్లభమయింది. ఇదంతా శాస్త్రి గురుత్వప్రభావమే కాబోలు ననుకున్నాడు. ఇక, శాస్త్రి ఆమెను మార్చేదేమిటి, వున్న ఆ కాస్త దైవభక్తి సరళలో పోతోన్న తరవాత! తనే స్వయంగా వెళ్ళి బుజ్జగించి, లోకపు తీరూ తెన్నూ బోధించి ఆమె నొక గృహిణిగా ఎందుకు మార్చకూడదూ? అతనిలో ఈ ఆలోచన లేచేసరికి, ఎదురుగా శాస్త్రి వచ్చి 'చేయవచ్చును; కాని నువ్వు నైతికంగా పిరికివాడివి!" అన్నట్లయింది. ఉద్యమమే ఉదాత్తమైన దయినపుడు, జంకు దేనికి? రహస్యం ఎందుకు? సోక్రటీస్ నిర్భయంగా స్త్రీలతో మాట్లాడేవాడు కాడా? వెలయాలుకదా అని చెప్పి, ఆమె ఆహ్వానాన్ని బుద్ధుడు తిరస్కరించేడు కనుకనా! మానవుల అవస్థలను తెలుసుకోవాలంటే వారితో లీనమైపోవాలి; కవులు కలిసిపోవాలి. కవులకే విశేషాధికారం వుంది. జీవితాన్ని పరిపూర్ణంగా పరిశీలించాలనే కోరిక న్యాయమైనది.

ఇంతవరకూ అతను సంశయవాదే; దేవుడు వున్నాడా లేడా అనే తర్కంతో పరిశోధిస్తున్నాడు. కాని యీసారి దేవు డున్నాడనే నమ్మకం కొద్ది కొద్దిగా కలగ నారంభించింది. పూర్వపు నమ్మకం మెల్లి మెల్లిగా సడలిపోతూంది. ఆత్మ, పరమాత్మ జీవుడికి వేరేలోకం వున్నాయి; సాజాత్యం వున్న జీవుళ్ళమధ్య అద్భుతాకర్షణ వుండి వుండాలి. మహా ఉద్రేకం, ఈశ్వరప్రేరేపితమైన ఉద్రేకం బ్రౌనింగ్ మహాకవిని ఆవేశించింది! అందుచేత నిజమైన ప్రేమ ఎన్నటికీ వ్యర్థం కాబోదని ఆలాపించాడు. ఇది గంభీరసత్యమే.

రంగనాథయ్యరు విచిత్రమైన మనస్తత్వంలో పడి కొట్టుకుంటున్నాడు. విజ్ఞానశాస్త్రాభ్యాసం, సంశయనివృత్తికి మారు, సందేహాలను కలిగిస్తోంది. సంశయాల మబ్బుతెర కళ్లను కమ్ముకుంటోంది. కూడని అనుభవాల ఆనందంకోసం, తాపత్రయపడుతూ, మోసగిస్తోంది. ప్రతిఘటింప వీలులేని, అత్యంత ఆకర్షణీయమైన వస్తువేదో తనను దగ్గరకు లాగుకుంటున్నది. దీనికిగల హేతువేమిటి? ఆలోచించి చూస్తే ఆకర్షణ అర్థంలేనిదికదా! అడుగడుగునా యిదే తర్కం అతన్ని పీడిస్తోంది; దుఃఖపెడుతోంది; విసిగిస్తోంది.

౫

క్రిస్టమస్ సెలవులు వచ్చాయి. 'ఫి' అనే పట్టణంలో సంఘసంస్కారులు సభ జరుపుకుంటున్నారు. అందులో రంగనాథయ్యర్, పడుపువృత్తిమీద, ప్రధానమైన తీర్మానమొకటి ప్రతిపాదింపవలసివుంది. కానైతే ఆయన యీ మీటింగులకు హాజరు కాలేకపోయాడు. కేవలం లేబరేటరీలో కూర్చుని ఏకాంతవాసం చేస్తున్నాడు. ఎలక్ట్రిసిటీ మీద ప్రయోగాలు చేస్తూ తనను తానే మరిచిపోతున్నాడు. రోజులతరబడి యిదే పరిశోధన.

ఒకనాటి సాయంకాలం, ప్రయోగంచేసి చూసుకుంటూ, సంతోషం పట్టలేకపోయాడు. అతని వదనం ఉజ్వలంగా వుంది. కనులలో సంతృప్తి వెల్లివిరుస్తోంది. అందరూ కోరదగిన ఆ పరిశోధన విజయవంతంగా ముగియవచ్చింది! ఆనందంతో, ఆవేశంతో, కుర్చీమీద చతికిలపడ్డాడు. ఎదురుగా బెంచీమీద ఒక చక్కని ముద్దులొలికే పిల్ల కూర్చుని

వుంది. ఆ పిల్లవి నల్లనికళ్లు; గాలి కెగిరే ఉంగరాల జుత్తు. అప్పుడే కనుచీకటి పడుతోంది. ఎదురుగా వున్న దెవరని చూశాడు. ఏదో భ్రమ తప్పితే మరేమీ లేదు. కళ్లు నులుపుకుని మళ్ళీ చూశాడు. భ్రమ కాదు; నున్నగా జారిపడుతూ ఉంగరాల జుత్తులో వున్న అతి చక్కని చిన్నది! ఆ పిల్లను చూడగానే, కవితావేశం ఉప్పొంగి యింగ్లీషులో పాడడ మారంభించాడు:

"ప్రేమయన్నది అసలె తెలియదు
ముద్దులొలికే పసిపాపకు!
చావె, మేలని ప్రేమకన్నను
కొంచమైనను తెలియదాయెను!"

పాట ఆపి, బాలికను సమీపించి యిలా యింగ్లీషులోనే, ఆమె కర్థమవుతుందనే కాబోలు, ప్రశ్నించాడు:

"ఇక్కడ నీకున్న పనేమిటి పిల్లా?" ఆ పిల్ల బిత్తరపోయింది. ఇదేమీ పట్టించుకోకుండా "ఇంద్రలోకంనుంచి అమృతం తెచ్చావా? నరకంనుంచి యమపాశం తెచ్చావా?" ఆ చిన్నపిల్ల మరీ గాభరా పడసాగింది. వణకుతూ అతనిచేతి కొక ఉత్తరం అందిస్తూ "ఇది మా అక్కయ్య..." అని ఆగింది. ఉత్తరం అందుకుని చూసుకున్నాడు.

"నువ్వు సరళ చెల్లెలివా?"

"అవును."

"పేరూ?"

"తరళ."

"తరళా!"

రంగనాథయ్యరు ఉత్తరం లోలోపలనే చదువుకోసాగాడు. పిల్లదస్తూరీ ముత్యాల సరాలవలె వుంది. ఉత్తరంలో సరళ రెండుసంస్కృత శ్లోకాలను రాసింది. రమ్యార్థప్రతిపాదకాలయిన ఆశ్లోకాలు అగాధాలలోనికి దారి చూపిస్తున్నాయి. చదువుకొన్నాడు; మళ్లీ మళ్లీ. అర్థం చమత్కారంగా వున్నట్టు తోచింది. "చంద్రకాంతిని ఆస్వాదించే చకోరం యితరమైన ఖాద్యాలను తిరస్కరిస్తుంది. కాని, అయ్యో! మేఘపంక్తులు రేరాజును కప్పివేశాయి. మిణుకురుపురుగు 'నేను నీకానందమిస్తాను; ఇక్కడే వున్నాను' అని నిశతో చెపుతున్నది. కాని రాత్రి ఓదార్పుబడలేదు. ఆమె చంద్రునికోసం నిరీక్షిస్తోంది. చంద్రుడొకడే ఆమె చీకటులను తరిమికొట్టగలడు."

ఈ శ్లోకాలలో వున్న తాత్పర్యం అతని హృదయాన్ని కరిగించివేసింది. సరళ ఆత్మ ఈ లేఖలో యిమిడివుంది. ఆమె ఆత్మ, ఆమె దేహంకంటె సుందరమైనది; నిర్మలమైనది; ఉజ్వల తేజోమయం. ఒక నీచకులంలో జనించిన స్త్రీలో యింతటి దేవతా స్త్రీల లక్షణాలుండడం ఆశ్చర్యం!

"నీ పేరెవరమ్మా? తరళే కదూ! తరళా! నీ కింగ్లీషొచ్చునా?"

"కొద్దిగానండీ!"

"స్కూల్లోనే చదువుతున్నావా?"

"అవును"

ఈ సమాధానం విని రంగనాథయ్యరు మొదట కొంచెం ఆశ్చర్యపడ్డాడు; సానిపిల్లకు గరల్స్ స్కూల్లో ఎలా ప్రవేశం కలిగిందని అతని సంశయం; అహఁ! యిందులో ఏముందీ; తను గర్భగుడిలా చూసుకుంటూన్న లేబరేటరీలోనికి ఆ పిల్ల ఎంత నిర్భయంగా దాడిచేసింది? ఇఁక స్కూల్లో ప్రవేశించడమంటే వింతేముంది! సరళ చిట్టి చెల్లెలు యిక్కడకు రావడమే గొప్ప; ఆ పిల్లకు స్వాగతం! తను యింగ్లీషులో మాట్లాడితే ఆ పిల్లకు అర్థం కాకపోవచ్చును; తెలుగులోనే ప్రశ్నించాడు:

"ఈ రహస్యం ఏ మాత్రం బయటకు పొక్కనీయకేం?"

"అలా అనే చెప్పి నన్ను పంపించారండీ!"

"చాలా మంచిపిల్లవి! మీ అక్కతో ఈవాళ వస్తానని చెప్పేం; వచ్చి నాలుగు విషయాలూ బోధిస్తానని చెప్పు"

"అలాగే సార్!"

"అచ్ఛా! మీ అక్కతో నాకు పనుంది. ఎవర్నీ రానీయవద్దు; ఆఖరికిమీ అమ్మకూడా"

"ఎవర్నీ రానీయఁవండీ! మీ రొక్కరే మాట్లాడుదురుగాని"

"అదే మరి! నువ్వూ సరళా తప్ప మరెవ్వరూ వుండొద్దు"

అలాగే నని తరళ బుర్ర ఊపుతూ వెళ్లిపోయింది. ఆ సాయంకాలం రంగనాథయ్యరుకి సంతాపమూ కలిగింది; ఉల్లాసమూ పుట్టింది. సరళ యింటికి వస్తానని వాగ్దానం యిచ్చేటంతటి అలసత్వం ఎందుకు కలిగింది? ఏమిటీ దౌర్భాగ్యమని కొన్నేపు చికాకుపడ్డాడు. తానొక ఘనకార్యార్థం ప్రాణాలను అర్పించే మహాత్యాగిగా భావించుకున్నాడు. సరళతో ఐక్యతకోసం, స్వర్గానందంకోసం, దేనినైనా సరే త్యజించాలి. జీవితంలో ఏది శాశ్వతం? నిర్మల

మైన ప్రేమ పవిత్రమైనది. ప్రేమికుల హృదయాల మధ్య తన క్రూరసంప్రదాయాలతో, ప్రపంచం అడ్డుగా నిలబడుతోంది; సమాజం పుట్టినదాది, ఇదే పద్ధతి. సాటి ఆత్మకోసం, హృదయం— పరితపిస్తుంది! పెరిక్లెస్సు, పాపం—ఎస్పేసియా వంటి దేవతకోసం పరితపించిపోయాడు......కాని ప్రపంచం—ఆహా! ఆ ప్రేమికుల హృదయాలను వేరుచేసింది. మానవుల ఆనందాన్ని చూసి గ్రీకు దేవతలకంటె కూడా, అధికంగా యీ లోకం కళ్లుకుట్టుకుంటున్నది. ఎంత చూడలేనితనం!

౬

చీకటిపడింది. చిన్న చిన్న తుంపరలు పడుతున్నాయి. మాటు మణగింది. వీధులు నిశ్శబ్దంగా వున్నాయి. సందులన్నీ దాటి చుట్టుదారిని అయ్యరు, సరళయింటికి వెడుతున్నాడు. ఆవిడ యింటిముందు, ప్రత్యేకం, ఛైర్మన్ స్నేహితుడు వేయించిన, వీధి లాంతరు వెలుగుతోంది. ఆ ఇంటి క్రీనీడలో నించున్నాడు. ఎవరైనా చూస్తారేమోనని గుండె బితుకు బితుకులాడుతోంది. నరాలు జివ్వుజివ్వున లాగేస్తున్నాయి. వీధిలాంతరు దెయ్యంలా చూస్తోంది. ఎన్నడూ దేనికీ అదరనిగుండె ఝల్లుమంది. తొందరగా యింటికి పోవడం మంచిదేమో అనుకున్నాడు. ఎందుకొచ్చిన గొడవ, హాయిగా యింటికి పోయి పడుకోక!...ఇంతదూరమూ వచ్చాక తీరాచేసి, యింటికి రిక్తహస్తాలతో వెళ్లిపోవడమా? ఇంట్లోకి వెళ్లి ధైర్యంగా ఆమెతో మాట్లాడితే వచ్చే ప్రమాదమేముంది?

అతని హృదయం ఉయ్యాలలా అటూ ఇటూ ఊగుతోంది. చీడీమెట్లు గబగబ ఎక్కి, సంశయంతో గిరుక్కున వెనక్కి తిరిగి, దిగిపోతున్నాడు. ఇంటికి తిరుగుమొహం పట్టాడు. నాలుగడులు వేసేసరికి వెనక ఎవరో పిలిచినట్లయింది. అవును, ఆ గొంతు సరళ చెల్లెలు తరళదల్లే వుంది! అతన్ని పిలుస్తూ చనువుగా వచ్చి దగ్గరసా నిలబడింది. ఇంతసేపూ పడ్డ గాభరాను చూసి యీ చిన్నది తన నొక పిచ్చివాడికింద జమకట్టలేదుకదా! ఆ పిల్ల చలాకీగా మాట్లాడుతూ లోనికి తీసుకెళ్లింది. మేడమెట్లు చూపించింది. ప్రొఫెసరు మేడమెట్లు ఎక్కుతూంటే, గదిలోంచి గుప్పున పూలవాసన కొట్టింది. అగరుధూపం అలముకుంది వింతవింత పరిమళాలు సుస్వాగతమిస్తున్నట్లనిపించింది. స్వాగత మందుకుని, రెండవ అంతస్థులోనికి వెళ్లేసరికి, పుగాకువాసన సారాయి కంపు ముక్కుపుటాలను బద్దలు కొట్టసాగింది. శరీరమంతా వణుకుతోంది. హాలులో ఒకమూల ఆయిల్ లాంపు వెలుగుతోంది. బీరువాలు, సోఫాలు, కుర్చీలు గదికి నిండుగా వున్నాయి. అలంకరణ కొంత పాతకాలపుది; మరి కొంత యీ కాలపుది! రవివర్మ రంగురంగుల పటాలు, తంజావూరు నాయకరాజులనాటి పౌరాణిక చిత్తరువులు గోడకు వేళ్లాడుతున్నాయి. ఈ అధునాతన శతాబ్దంలో వుండదగని అవి ఎంతో అనాగరికంగా వున్నాయి! గోడలపొడవునా అక్కడక్కడ నగిషీ చెక్కిన గూళ్లు వున్నాయి. వాటిలో కర్ర, లక్క, పోర్సిలీను బొమ్మలు, వస్తువులు చిందరవందరగా పడివున్నాయి. మచిలీలో తయారైన సన్నని తెల్లని బట్ట సీలింగుకు కప్పబడివుంది. దానిమీద కృష్ణుని రాసక్రీడ చిత్రితం; రంగురంగుల గ్లోబులు, జిగజిగమనే గాజువస్తువులు సీలింగునుంచి వేళ్లాడుతున్నాయి. పెద్ద చందనపు పందిరిపట్టెమంచం హాలులో ఒకమూలను ఆక్రమించుకుంది. దానిమీద విలువైన దుప్పట్లు, పరుపులు పరిచివున్నాయి. నేలమీద అరిగిపోయిన ఏలూరు తివాసీ వుంది. తివాసీమీద గీసిన అగ్గిపుల్లలు, సిగరెట్టుపీకలు, గ్లాసులు, హుక్కాగొట్టాలు, కిల్లీముక్కలు, పీకదానలు, చిందరవందరగా కనిపిస్తున్నాయి. ఏహ్యమైన యీ గది వాతావరణం అతని కెంతో జుగుప్సను కలిగించింది. తరతరాలనుంచీ, పాపపంకిలమైన అతి నీచపు కామకృత్యాల కిది నిలయం; లెక్కలేని జీవితాలను నాశనంచేసి పొట్టను బెట్టుకున్న ఈ గదికంటె అపవిత్రమైన స్థలం, యింకొకచోట వేరే వుంటుందా? ఇక్కడ జీవిస్తూనే సరళ ఉదాత్తతను ఎలా కాపాడుకోగలిగింది? ఇంతకీ 'నేను దుస్సాధ్యమైన కార్యాన్ని సాధించబూనడం లేదుకదా!'

రంగనాథయ్యరు సరళ చెల్లెల్ని "ఈ నరకకూపంలో మీ రెలా గడుపుకొస్తున్నా రమ్మా!" అని అడిగేడు. "కాదండీ! ఇది మా అమ్మ పడకగది!" అమాయకంగా తరళ జవాబిచ్చింది.

"ఇందులో ఆశ్చర్యం లేదులే! ఈ మురికికూపంలోంచి త్వరగా అవతలకి తీసుకెళుదూ తల్లీ!" ఈ మాట విని ఆ పిల్ల చరచర హాలులోంచి నడిచివెళ్లి తలుపు తెరిచింది "ఇలా రండి. ఇటే ఇటే."

౭

సరళ గదిలోనికి వెడుతూ రంగనాథయ్యరు "హమ్మయ్యా! నరకంలోంచి స్వర్గానికి" అన్నాడు. అతను చూసిన మొదటి గదికీ, దీనికీ ఎంతో వ్యత్యాసముంది. గోడలు అందంగా అద్దంలా మెరుస్తున్నాయి. గదికి నాలుగు ద్వారాలు, ఆరు పెద్ద కిటికీలు వుండడంవలన గాలి విస్తారంగా లోనికి వీస్తోంది.

డోము వేసిన పెట్రొమాక్సులైటు వెన్నెలలా గది నిండా కాంతిని జల్లుతోంది. ద్వారబంధాలకు మామిడి తోరణాలు, బంతిపూలదండలు వింతశోభ నిస్తున్నాయి. గదిలో తెల్లని మార్బుల్ బల్ల వుంది. దానిమీదకు అప్పుడే ఎగిరివచ్చి వాలిందా అన్నట్లు ఒక ఎనామిల్ నెమిలి విగ్రహం, పింఛం విప్పుకుని పింఛంలోనుంచి వూదొత్తుల వాసనలను గదంతా నింపుతోంది. పెయింటింగులు, రామాయణ భారత కథలకు చెందిన చిత్రాలు, ప్రపంచ ప్రముఖుల, సంఘ సంస్కర్తల, కాంగ్రెసునాయకుల ఫోటోలు గది నలంకరించాయి. గోడలకు రెండు నిలువుటద్దాలు అమర్చబడి గదిశోభను ద్విగుణీకృతం చేస్తున్నవి. గది మధ్యను పెద్ద సోఫా, దాని చుట్టూ కుషన్ కుర్చీలు, పడుకునే మంచాలు, వున్నాయి. ఓక్ కర్రతో చేయబడి పాలిష్ చేసిన, రివాల్వింగు బుక్కేసొకటి వుంది. దానిమీద మహా మేధావుల, ప్రపంచ వీరుల బస్టులు వున్నాయి. కిటికీవద్ద నల్లని బల్ల వుంది. దానిమీద ఒక వీణ, గులాబీపూల మధ్యను వుంచబడింది. రంగనాథయ్యారు అటు చూశాడు. ఆశ్చర్యం! తన ఫోటో, బల్లమీద కనిపించింది. 'ఈ సొగసులాడి మనసును వశపరుచుకునే ఆకర్షణ ఈ రంగనాథయ్యారులో ఏమున్నదనీ?' అని ప్రశ్నించుకున్నాడు; 'నాలోవున్న అందం కాదు; కాని నాలోని మేధాశక్తి ఆవిడ మనసును పట్టుకుని వుంటుంది. ప్రేమ ద్వారాలను ప్రేమే తెరవాలి. పాపం సరళ వెర్రి పిల్ల. ఒకరి అభిమానాన్ని ఎరగదు; ప్రేమనుకూడా...'

పక్క హాలులోంచి ఎవరిదో బరువైన పాదధ్వని వినిపించి, అటు తిరిగి చూశాడు. గది దాటి హాలులోకి వెళ్లే తలుపును ఓరవాకిలిగా తెరిచి బయటకు చూశాడు. ఎవరూ రావడం లేదు; తలుపులు చప్పుడు కాకుండా మూసివేశాడు. 'అవతల హాలులో అనాగరికత, వికృతం, జుగుప్స; ఇవతల గదిలో సౌందర్యకళామయ నైర్మల్యవాతావరణం! ప్రకృతిలో ద్వంద్వశక్తుల సంపుటీకరణ యిక్కడే గోచరిస్తోంది' అనుకుంటూ తరళను పిలిచాడు:

"ఆ తలుపులు వేసేద్దూ, నీకు పుణ్యం వుంటుంది. కంపు చంపుకుతింటోంది."

"సృష్టిలో అనాదినుంచీ పాపం పుణ్యం ఒకదాని పక్క యింకొకటి వుంటూనేవున్నాయ్" అనే జవాబు వినవచ్చింది. అయ్యారు నిర్ఘాంతపడ్డాడు. చిన్నపిల్లకు యింతటి బరువైన మాటలే!...కొంచెం ఆగి చూసేసరికి సరళ ప్రత్యక్షమయింది;

తగుమాత్రపు అలంకారాలు ఆమె అభిరుచి గొప్పదని వ్యక్తం చేస్తున్నాయి. వస్తూనే సరళ నమస్కరించి కూర్చోండని అతనికి కుర్చీ చూపించింది. అతను కూర్చోగానే తరళ బయటకు వెళ్లిపోయింది. సరళ ముందుకు వచ్చి, ఎదురుగా ఉన్న బల్లమీదకు వంగి, మోచేతులాని, చేతులమీద మొహం పెట్టుకుని నిలబడి చూస్తోంది. ఆవిడ అందాన్నే తాగేస్తున్నాడా అన్నట్లు అతనూ తదేకదీక్షతో ఆమెవంక చూస్తున్నాడు. సరళ సిగ్గుతో తలవొంచుకుంది. కాలి బొటనవేలుతో నేల రాస్తోంది. తను అలా చూడటం మొరటుతనమని అతనికి గుర్తింపుకు రాలేదు. సరళ కనిపించగానే, యింతకుముందు తాను తయారుచేసుకున్న ఉపన్యాసం మర్చిపోయాడు. ఇపుడాతనికి ఒకటే కోరిక. లలితమైన ఆమె పెదవులమీద అచ్చువేసినట్లు ఒక ముద్దు పెట్టుకుంటే! ఎవరడ్డుతారు?

ఎంతో కష్టంమీద కోరికను లోపలనే అణచుకున్నాడు. సరళ అనిన ఆఖరు మాటలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ "అదంతా నిజమే! కాని అవినీతి కోరదగినదేనా? మీరు చెప్పినట్లు నీతి పక్కనే అవినీతి నిల్చివున్నదీ అంటే, దాన్ని చూసి సహించమని కాదు! పూర్తిగా నిర్మూలించమని."

"మీవంటి విజ్ఞానులముందర, మాబోటి అజ్ఞానులం నోరు మెదపగలమా?"

"నోరు మెదపలేరుకాని మీవంటి శిష్యరాళ్లు మావంటి గురువులచేత నానా అసందర్భాలీన్ని మాట్లాడించగలరు!"

"చెడు పెరుగుతోన్నకొద్దీ మంచి క్షీణిస్తూనే ఉంటుంది. లోకసహజమే మరి!"

"అందుకే అవినీతిని మటుమాయం చేయాలి!"

"ఎలా పారద్రోలడమో చెప్పండి! విజ్ఞానం వుదయించేవరకూ, మంచీ చెడ్డా, ఒక సరసనే పెరిగాయి కదా! మాయ అనేది ఒకటుందంటాన్నేను. ఆ మాయకీ, నీతీ అవినీతీ అనేవి రెండూ రెండు కవల పిల్లలు. మరి మాయలేని సృష్టే లేదూ!"

సరళ చెప్పిన యీ మాటల అర్థం తెలియక రంగనాథయ్యారు తికమకపడ్డాడు. ఒకక్షణం నిశ్శబ్దంగా గడిచాక, అతను సరళ నుద్దేశించి: "దేవతాస్త్రీలా కనిపిస్తున్నావు సరళా! నేను సోక్రటిస్‌నని చెప్పుకోబోవడం లేదు; కాని నువ్విపుడు చెప్పినదంతా, కేవలం వేదాలలోని మిస్టిసిజం. అది వేదపండితులకే అర్థంకాదు; ప్రత్యక్షజీవితంలో మనం ఎదుర్కొంటూన్న విషమ సమస్యలను పరిష్కరించుకుందుకు యీ వేదవిజ్ఞానం ఒక్క పిసరు అక్కరకురాదు. విజ్ఞానంగురించి పండితులు మాట్లాడుతున్నారో, ఆ విజ్ఞానం అందరికీ అందేదికాదు; కొంతమందికే సాధ్యం; అదైనా నాకు సందేహమే!"

"అయితే మనకు పనికివచ్చే జ్ఞానమేలాటి దంటారు?"

"అది ఒకే ఒకటి; యుగయుగాల జీవితానుభవం! ఈ విజ్ఞానమే మన దైనందిన జీవితానికి సహాయకారి; చీకటిలోంచి వెలుగులోకి తెస్తుంది."

"మీలాటి గురువుల ఉపదేశం పొందుతూ, యీ జీవితాన్ని వెళ్లబుచ్చుకుంటాను."

"నే నేమీ మహానుభావుణ్ణి కాను. నామీద అభిమానంకొద్దీ నువ్వలా అనుకుంటున్నావు కాని నే నా పొగడ్తలకు తగను సరళా! నే నో కాలేజీ మాస్టర్ని...కాని నీ మనోనిశ్చయం గొప్పది. ఈ జీవితంనుంచి, నీ ఉదారస్వభావానికి తగని యీ మలిన జీవితంనుంచి, బయటపడు; అందుకు నాచేతనైన సహాయం చేస్తాను."

"ధన్యురాలిని. దేవుడి దయ నామీద వుంది. లేకుంటే మీరు నా దగ్గర కెందుకు వస్తారు చెప్పండి! నాది అపవిత్రమైన జీవితమని మీవల్ల యిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. నా జీవితంమీద నాకే అసహ్యంగా వుంది. ఛీ, ఛీ! నన్నీ మురికి కూపంనుంచి బయటకు తీసుకుపోరూ? నన్ను కనికరించి, ప్రబోధించండి. మీతో ప్రపంచపు చివరికైనా పయనించి వస్తాను. రక్షించండి"

'ప్రపంచపు చివరలవరకూ' ఆమె తనతో పయనించడం! ఇది కాదు ప్రొఫెసరు వాంఛించినది.

"నా ఉద్దేశం అది కాదు సరళా! నువ్వీ జీవిత పద్ధతిని విడిచిపెట్టాలని నాకోరిక; విడిచిపెట్టి—

"ఏం చేయమంటారు?"

"నిన్నెవరూ ప్రేమించడం లేదూ?"

"నన్నా'? ప్రేమించడమా? ప్రేమించడం! ఎంత వింత మాటలండీ మీవి."

"ఏమీ?"

"మీరు తీసుకుంటోన్న యీపాటి శ్రద్ధ ఎన్నడూ ఎవరూ తీసుకోలేదు; మా అమ్మ వుందీ అంటే అది నాకు అమ్మే కాదు. పోనీ, నాదగ్గర కొచ్చే ప్రేమికులో అంటే; వాళ్లకి ప్రేమనేది ఒకటుంటుందనే మాటే వినివుండరు!"

ఆమె నల్లని కనురెప్పలనిండా నీరు నిండుకుంది. కన్నీటి బొట్లు జలజల రాలిపడుతున్నాయి. హృదయం ద్రవించసాగింది. ఆవిడ స్థితిని చూసి ప్రొఫెసరు జాలిగుండె కరిగిపోతున్నది కాని ఆమెను ఏమి చేయడం? తనవెంట లోకం మధ్యకు తిసుకు వెళ్లే ధైర్యం అతనికి లేకపోయె!

"ఎవరినైనా వివాహం చేసుకుంటే బాగుండును సరళా!"

"అంటే ఎవడో ఒక ఛండాలునికి నేను కలకాలం పూర్తిగా బానిసనై పడి వుండాలని మీ తాత్పర్యం!'' సరళ మందహాసం చేసింది; కొంచెంసేపు ఊరుకుని మళ్లీ అంది: "నా బోటి భోగంపిల్లలను ఏమర్యాదస్థుడు పెళ్లాడతాడో చెప్పండి మీరే!"

సరళ వేసిన ప్రశ్న రంగనాథయ్యరుకు యింతకుముందెన్నడూ తట్టివుండలేదు. ఈ సమస్యను సంపూర్ణంగా ఎన్నడూ చర్చించలేదు; వ్యభిచార నిర్మూలన ఎలా సాధ్యమో, ఎలా అసాధ్యమో అతనాలోచించలేదు. పుస్తకాలలోని సిద్ధాంతాలు, వల్లెవేయడం తప్ప, అవి జీవితంలోనికి పరివర్తింప చేయడమెలానో, ఊహించుకోలేదు; భోగంపిల్లలంటే ఒకటే నిర్వచనం; వాళ్లు జీవితంలో ఓడిపోయిన స్త్రీలు! పశుప్రవృత్తికి వ్యతిరిక్తమయిన వాదనలను పోగుచేసుకోవడంతోనే కాలం గడిచిపోయింది. సైనికుడిలా ఈ పుస్తకవిజ్ఞానం మధ్య కవాతు చేస్తున్నాడు...ఇప్పుడు అతని అలసత్వం అతనికే తట్టి ఒళ్లు నీరు విడిచిపోయింది...చిట్టచివరకు అతననుకున్నాడు కదా, 'నేనే రాజునైతే, డబ్బు చూపించి అన్నీ గెల్చుకొద్దును; సరళను చదువుకున్న కుర్రవాడిని చూసి, ధనాశ చూపి, పెళ్లి చేద్దును...పోనీ, మాటవరసకు తనొక రాజుగా పుట్టాడనుకుందాం. అప్పుడుమాత్రం సరళను పెళ్లాడగలిగే విద్యావంతుడు, యువకుడు, అందగాడు దొరకాలికదా?" తనకు పెళ్లి కాకుండావుంటే ఎంత బాగుండును! ప్రపంచాన్ని ధిక్కరించయినా, సరళను పరిణయమాడేవాడు.

ఇద్దరి మధ్యను సంభాషణ ఆగిపోయింది. మౌనంగా అతను కూర్చున్నాడు. మొహం వివర్ణమయింది. నిశ్చలమైన యీ నిశ్శబ్దత ఎంతో చికాకు కలిగిస్తోంది. సరళ యథాలాపంగా బల్లమీదను వున్న వీణ తీసింది. సోఫా చివరకు వెళ్లి చతికిలబడి, మధురమైన కృతిని కిన్నెరకంఠంతో పాడసాగింది. అతనికి సంగీతమంటే ప్రాణం; కృతి ఎంతో బాగుంది. రాగం హాయిగా వినవస్తోంది. పాము పడగ విప్పి ఆడినట్టు, లేడి గంతులు వేసినట్టు, అతని హృదయం ఆనందించసాగింది. నాజూకైన వేళ్లతో వీణను మీటుతుంటే, సరళ అప్సరసలా స్ఫురించింది. వీణ మెట్లమీద ఆడే ఆమె చేతి వేళ్లు ఎంత అందంగా

వున్నాయని! నిస్తబ్ధతగా వున్న వాతావరణంలో వినిపించే సంగీతం అతన్ని బాహువులతో బంధించినట్లనిపించింది. నిస్సహాయురాలైన ఒక పిల్లను ఉద్ధరించడ మెలాగనే అతని ఆలోచనాహారం తెగిపోయింది. ములిగిపోతున్నాడు; ఆత్మను కరిగించే సంగీతంలో ములిగిపోతున్నాడు! ములిగిపోతూ ఊహాప్రపంచంలో తిరుగుతున్నాడు: 'దీనికంటె వేరే స్వర్గం ఎక్కడో వుంటుందా? అర్థంలేని పురాణకల్పనలు! దేవతలకుమల్లే వున్న ఆమె పెదవులను ముద్దుపెట్టుకోవడమే నిర్వాణం. చిదానందమనే వెర్రివేదాంతంలో పడి మహర్షులు యీ నిర్వాణాన్ని పొందలేకపోయారు.'

సరళ వేళ్లు వీణమీద యింకా నృత్యంచేస్తున్నాయి. జావిళీ రసవత్తరంగా ముగియబోతూ వుంది. సన్నగా తీయగా సంగీతం గదినంతా ముంచెత్తుతోంది. "నిజంగా ప్రపంచపు చివరలవరకు నాతో రాగలవా సరళా!" ప్రొఫెసరు లేచి గబుక్కున ముందుకు వెళ్లాడు. ఆమె పెదవులను ముద్దుపెట్టుకున్నాడు. సరళ చేతిలోని వీణ జారిపోయింది.

బయట వరండాలోంచి వికటాట్టహాసం వినిపించసాగింది. రంగనాథయ్యరు గాభరాపడి బెదురుతో చూశాడు. "సంస్కరణంటే యిదే! ఒకరిని లేవనెత్తబోయి మనమే కింద పడ్డం!" అనే మాటలు వినిపించి, ప్రొఫెసరు కంగారుపడుతున్నాడు. పళ్లన్నీ బయటకు కనిపించేటట్టు నవ్వుతూ "దగాలోపడ్డాను; మోసం, మోసం" అని వికృతంగా అరిచాడు. 'దగాలో పడ్డా'ననే మాట విని సరళ సిగ్గుపడిపోయింది; ఆశ్చర్యపడింది. అమాయకంగా నవ్వింది. తెల్లబోయి చూసింది. ప్రొఫెసరు మెల్లగా మేడ దిగి ఇంటికి పరుగెత్తసాగేడు.

తొందరగా అంగలు వేసుకుంటూ, వీధిలోనికి వెళ్లేసరికి మేడమీదనుంచి 'దొంగ దొంగ' అనే కేక వినిపించింది; పోలీసుల లైట్లు అతని మొహంమీద పడబోతూవుంటే తప్పించుకుని రంగనాథయ్యరు యింటికి దారితీశాడు.

కొంతదూరం నడిచేసరికి, పరిచయస్థులు ఎదురై "ఇంత రాత్రివేళ ఎక్కడనుంచి ప్రొఫెసరు?"... ఆ రాత్రి అర్జెంటుగా ఏదో స్వంతపనిమీద రంగనాథయ్యరు ఊరువదలి ఎక్కడికో వెళ్లిపోయాడు!

మర్నాటి ఉదయం, అమితగౌరవనీయుడు, సహచరుడు, ప్రొఫెసర్ రంగనాథయ్యరు పంపిన రాజీనామా లేఖను, ప్రిన్సిపాల్ గారు చూసి, కంట నీరుపెట్టుకున్నారు. తను పడిన దురవస్థను వివరిస్తూ ప్రొఫెసరు ప్రత్యేకించి ప్రిన్సిపాల్ గారికి రాసిన ఉత్తరంలోని పంక్తులను చదువుతున్నప్పుడు, ఆయన కళ్లు నీళ్లతో గిర్రున తిరిగాయి!